అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహిస్తాం

కోహీర్, మార్చి 24: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహిస్తామని అంబేద్కర్ నూతన ఉత్సవ కమిటీ కన్వీనర్ రాంచందర్ భీంవంశీ పేర్కొన్నారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ భవనంలో మొగులయ్య గౌతమ్ అధ్యక్షతన నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కన్వీనర్‌గా రాంచందర్ భీంవంశీ, కోశాధికారిగా కరణం రవికుమార్, కోకన్వీనర్లుగా దశరథ్, నర్సింహులు, బాలరాజ్, రాములు, నాగేందర్, వసంత్, రామచందర్, అంజయ్య, హోలియా రాములు, కిష్టయ్య, మారుతి, తులసీరామ్ రాథోడ్, నర్సింలు ఎన్నికయ్యారు. సలహాదారులుగా మొగులయ్య గౌతం, శ్రీనివాస్, నర్సయ్య, అశోక్, విఠల్, అశోక్‌కుమార్, బిచ్చయ్య, వరాలు, జయరాజ్, బండి మోహన్, అనంత్‌రావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కన్వీనర్ రాంచందర్ భీంవంశీ మాట్లాడుతూ అంబేద్కర్ 133వ జయంతిని ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.

సైనికుల్లా పని చేయాలి

నాగల్‌గిద్ద, మార్చి 24: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బలపర్చిన ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ విజయానికి కార్యకర్తలు సైనికులవలే పని చేసి విజయానికి కృషి చేయాలని బీజేపీ సినియర్ నాయకుడు అశోక్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలానికి చెందిన బీజేపీ కార్యకర్తలతో నారాయణఖేడ్ కేంద్రంగా విస్తృత స్థాయి సమావేశం ఎర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కార్యకర్త ప్రజలకు బీజేపీ చేసిన అభివృద్ధిపై వివరించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి శివాజి, అనిల్, కాశినాథ్, బసవరాజ్‌పాటిల్, జివన్, నాగిశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ దుకాణాలపై కొరడా

రామచంద్రాపురం, మార్చి 24: బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తున్న ఇద్దరిపై కొల్లూర్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లోని అపర్ణ లేబర్ క్యాంప్‌లో రాజుమండల్ అనే వ్యక్తి బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో తనిఖీలు చేసి 16 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశారు. కొల్లూర్‌లోని భోజ్యతండాలో రాజునాయక్ అక్రమంగా మద్యం విక్రయిస్తుండడంతో పోలీసులు తనిఖీ చేసి 11లీటర్ల మద్యాన్ని సీజ్ చేశారు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ రవీందర్ ఆదేశాల మేరకు ఏఎస్ఐ దేవేందర్ ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బీడీఎల్ ఉద్యోగి మృతి

రామచంద్రాపురం, మార్చి 24: రోడ్డు ప్రమాదంలో బీడీఎల్ ఉద్యోగి దుర్మరణం చెందిన ఘటన ఆర్సీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్ కాలనీకి చెందిన జి.యాదయ్య(58) బీడీఎల్ ఉద్యోగి. శనివారం రాత్రి భోజనం చేసిన తర్వాత వాకింగ్‌కి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న రైల్వే ట్రాక్ వద్ద రాజధాని హోటల్ ఎదుట నిలబడి ఉన్న అతడిని ఆర్సీపురం నుంచి ఈఎస్ఐ దవాఖాన రూట్‌లో వెళాల్సిన ఎస్‌టీఎస్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు అతివేగంగా టార్నింగ్ చేస్తున్న క్రమంలో యాదయ్యను ఢీకొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి అల్లుడు బేగరి యాదగిరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గుమ్మడిదల, మార్చి 24: అనారోగ్య కారణం, ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోవడంతో మనస్తాపానికి గురైన వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అనంతారంలో చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అనంతారం గ్రామానికి చెందిన పెరుగు కృష్ణ(54) కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రెండు రోజులకోసారి హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే దవాఖానలో వైద్యం చేయించుకుంటున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో శనివారం రాత్రి 7 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి వెళ్లిన కృష్ణ సమీపంలోని చెరువు కట్ట వద్ద తనతో తెచ్చుకున్న పురుగు మందు తాగాడు. కాగా, ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి ఎంతకూ తిరిగి రాకపోవడంతో అతడి కుమారుడు యాదగిరి పక్కింటి వ్యక్తి ఎండీ అజీమ్‌ను తోడుగా తీసుకొని చూసేసరికి కట్టపై పడి కన్పించాడు. నోట్లో నుంచి నురుగులు రావడంతో వెంటనే నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించి ప్రథమ చికిత్స చేయించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డిలోని జిల్లా దవాఖానకు తరలించి వైద్యం చేస్తుండగా పరిస్థితి విషమించి రాత్రి 11 గంటల ప్రాంతంలో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతిడికి ముగ్గురు కుమార్తెలు, కొడుకు ఉన్నారు. కొడుకు పెరుగు యాదగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు!

- మూగబోయిన టౌన్ ప్లానింగ్ విభాగం
- రెసిడెన్షియల్ అనుమతులు.. కమర్షియల్ నిర్మాణాలు
- మామూళ్ల మత్తులో జోగుతున్న అధికార యంత్రాంగం
- ప్రభుత్వ ఆదాయానికి గండి

భారతీనగర్ డివిజన్ ఎల్ఐజీలో రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని చేపట్టిన కమర్షియల్ నిర్మాణం

ఆర్సీపురం డివిజన్‌లో జాతీయ రహదారికి ఆనుకుని రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని నిర్మిస్తున్న కమర్షియల్ నిర్మాణం

రామచంద్రాపురం, మార్చి 24: జీహెచ్ ఎంసీ బల్దియా సర్కిల్ 22లో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడడం లేదు. ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు మౌనంగా ఉంటున్నారు. రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని బాజాప్తా కమర్షియల్ నిర్మాణాలకు పాల్పడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఎక్కువ శాతం జీప్లస్-2 అనుమతులు తీసుకుంటూ జీప్లస్-4 అంతకు మించి నిర్మాణాలు చేపడుతున్నారు. అక్రమ నిర్మాణాలు విచ్చలవిడిగా జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

ప్రజాప్రతినిధుల అండదండలతోనే..!

సామాన్యులు చిన్న ఇల్లు కట్టుకుంటే సవాలక్ష నిబంధనలు పెట్టే అధికారులు, అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నా మౌనంగా ఉండడం చూసి పలువురు పెదవి విరుస్తున్నారు. కొందరు ప్రజా ప్రతినిధుల అండదండలతోనే అధికారులు ఈవిధంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒకవేళ ఎవరైనా అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేస్తే నామమాత్రంగా టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. పైగా అధికారులే నిర్మాణదారులకు ఉచిత సలహాలు ఇచ్చి నిర్మాణం పూర్తి కాకముందే బయటి నుంచి వైట్‌వాష్ వేయించి నిర్మాణం పూర్తయినట్లు కలరింగ్ ఇస్తున్నట్లు తెలిసింది.

జోరుగా అక్రమ నిర్మాణాలు

జీహెచ్ఎంసీ సర్కిల్-22లోకి భారతీనగర్, ఆర్సీపురం, పటాన్‌చెరు డివిజన్‌లు వస్తాయి. ముఖ్యంగా భారతీనగర్, ఆర్సీపురం డివిజన్‌ల్లో అక్రమ నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయి. టౌన్‌ప్లానింగ్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. కొందరు స్థానిక ప్రజాప్రతినిధులు సైతం అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తుండడంతో అధికారులు చర్యలు తీసుకోలేక పోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

భవన నిర్మాణాల్లోనూ రూల్స్ బ్రేక్..

భవన నిర్మాణాల్లోనూ రూల్స్ బ్రేక్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జీహెచ్ఎంసీ నామ్స్ ప్రకారం ఇంటిని నిర్మించేటప్పుడు తీసుకున్న అనుమతులకు అనుగుణంగా నిర్మాణం ఉండాలి. సెట్‌బ్యాక్ మస్ట్. అదేవిధంగా ఇంకుడుగుంత తప్పనిసరి. కానీ, ఇక్కడ ఏ ఇంటి నిర్మాణం తీసుకున్నా అనుమతులకు మించి నిర్మాణాలు చేయడం.. సెట్‌బ్యాక్ సరిగ్గా ఉండవు. ఇంకుడు గుంతల ఊసే ఉండడం లేదు. వీటిని పర్యవేక్షించాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అనుమతులకు మించి నిర్మాణాలు చేపట్టే వారితో టౌన్ ప్లానింగ్ అధికారులు కుమ్మక్కై వారికి పూర్తిస్థాయిలో మద్దుతు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏ ఇంటి నిర్మాణం జరిగినా అధికారులను మ్యానేజ్ చేసుకోవడం మాత్రం నిర్మాణ దారులకు తప్పడం లేదని తెలుస్తున్నది. ఇంత తంతు జరుగుతున్న అధికారులు చర్యలు తీసుకున్న పాపానపోవడం లేదు. సామాన్యులకు ఒక న్యాయం.. సంపన్నులకు మరో న్యాయమా అంటూ పట్టణవాసులు ప్రశ్నిస్తున్నారు. ప్రజాప్రతినిధుల అడుగులకు మడుగులు పట్టకుండా అధికారులు నిక్కచ్చిగా వ్యవహరించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం..

జీహెచ్ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం. అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని తమకు ఫిర్యాదు వచ్చిన వెంటనే సదరు నిర్మాణదారుడికి నోటీసులు జారీచేసి రిప్లై అడుగుతున్నాం. రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని కమర్షియల్ నిర్మాణాలు చేసేవారిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.

– మధు, టౌన్‌ప్లానింగ్ అధికారి

కనుల పండువగా మల్లికార్జునస్వామి కల్యాణం

బొంతపల్లిలో మల్లికార్జునస్వామి వారికి కల్యాణం జరిపిస్తున్న భక్తులు

గుమ్మడిదల, మార్చి 24: కేతకీ భ్రమరాంబమల్లికార్జునస్వామి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. మండలంలోని బొంతపల్లిలో వెలిసిన కేతకీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం జాతర నిర్వాహకులు వడ్డె ఎల్లయ్య, ముద్దంగుల ఎల్లయ్య తదితరుల ఆధ్వర్యంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలను వైభవంగా ప్రారంభించారు. ఇందులోభాగంగా కేతకీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో స్వామి వారికి, అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు భక్తిశ్రద్ధలతో కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అగ్నిగుండాలలో భక్తులు నడిచి మొక్కులు తీర్చుకున్నారు. ఒగ్గు కళాకారులు చెప్పిన కథను భక్తులు శ్రద్ధతో విన్నారు. అనంతరం దప్పుచప్పుళ్ల మధ్య బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కల్యాణోత్సవానికి కాంగ్రెస్ జిల్లా నాయకుడు నీలం మధుముదిరాజ్, జడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఎంపీపీ సద్ది ప్రవీణా విజయభాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఆలేటి నవీనాశ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్, చిమ్ములన ర్సింహారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నరేందర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. వందలాది మంది భక్తులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. వచ్చిన వారికి అన్నదానం చేశారు.

స్నాతకోత్సవం

కోహీర్, మార్చి24: జహీరాబాద్ పట్టణంలోని డాక్టర్ ఆర్ఎల్ఆర్ పాఠశాల్లో ఆదివారం స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ లక్ష్మారెడ్డి, ప్రిన్సిపాల్ కవితరెడ్డి చేతుల మీదుగా గ్రాడ్యుయేషన్ పట్టాలు స్వీకరించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుడి ఎన్నిక

జిన్నారం, మార్చి 24: మంగంపేట గ్రామంలో బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుడిగా రాజా భార్గవను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం బీజేపీ మండలాధ్యక్షుడు జగన్‌రెడ్డి సమక్షంలో బూత్ కమిటీ ఎన్నిక జరిగింది. బూత్ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన రాజా భార్గవకు మండలాధ్యక్షుడు జగన్‌రెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు.

పార్కింగ్ కోసం రోడ్లు ఆక్రమణ

గడ్డపోతారం పారిశ్రామిక వాడలో పార్కింగ్ కోసం షెడ్డు ఏర్పాటు

భాజీపల్లి పారిశ్రామిక వాడలో రోడ్డునే పార్కింగ్

- గడ్డపోతారం, భాజీపల్లిలో పరిశ్రమల దర్జా
- పీఆర్ రోడ్డును ఆక్రమించి గేటు ఏర్పాటు

జిన్నారం, మార్చి 24: వాహనాల రాకపోకలకు వినియోగించాల్సిన రోడ్లను పలు పరిశ్రమలు ఆక్రమించాయి. రోడ్లను ఆనుకొని వాహనాల పార్కింగ్ కోసం షెడ్లు ఏర్పాటు చేశాయి. దీంతో పారిశ్రామిక వాడలోని పీఆర్ రోడ్లు కుచించుకుపోయాయి. ఎదురెదురుగా రెండు భారీ వాహనాలు వస్తే రోడ్డు సరిపోవడం లేదు. పరిశ్రమలు రోడ్డును ఆక్రమించి షెడ్లు ఏర్పాటు చేయడంపై రెండు గ్రామ పంచాయతీలలో ప్రజాప్రతినిధులు, అధికారులకు స్థానికులు ఫిర్యాదులు చేసినా ఇప్పటివరకు ఎలాంటి ప్రయోజనం లేదు.

పంచాయతీరోడ్లు పరిశ్రమ ఆధీనంలో..

గడ్డపోతారం పారిశ్రామిక వాడలో ఒక పరిశ్రమ ఏకంగా పీఆర్ రోడ్డును ఆక్రమించి రోడ్డుకు గేటు ఏర్పాటు చేసుకుంది. ఇది జరిగి సుమారు పదేండ్లకుపైనే అవుతున్నది. రోడ్డును ఆక్రమించి గేటు ఏర్పాటు చేసుకొని పంచాయతీ రోడ్డును మలుపులు తిప్పి మరో రోడ్డుకు లింకు చేసింది. దీనికి అప్పటి పంచాయతీ పాలకవర్గం కూడా పరిశ్రమకే అనుకూలంగా వ్యవహరించింది. ఇప్పటికీ పంచాయతీ రోడ్డు ఆ పరిశ్రమ ఆధీనంలోనే ఉంది. దీంతో అక్కడి నుంచి పరిశ్రమలు పార్కింగ్ కోసం పారిశ్రామిక వాడ రోడ్లను క్రమంగా ఆక్రమించి షెడ్లు ఏర్పాటు చేస్తున్నాయి.

ఒకదాన్ని చూసి మరోటి..

ఒక పరిశ్రమను చూసి మరో పరిశ్రమ రోడ్డుకు పార్కింగ్ షెడ్లు నిర్మిస్తున్నాయి. కార్మికులు వారి వాహనాలను రోడ్ల పక్కనే షెడ్లల్లో పార్కింగ్ చేస్తున్నారు. దీంతో భద్రత లేకుండా పోయిందని కార్మికులు వాపోతున్నారు. తరుచూ వాహనాలు దొంగతనాలకు గురవుతున్నాయి. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకమైన స్థలంలో షెడ్లను ఏర్పాటు చేసి సెక్యూరిటీని ఏర్పాటు చేసుకోవాల్సి ఉన్నా పరిశ్రమలు పట్టించుకోవడం లేదు. పరిశ్రమ స్టాఫ్‌కు సంబంధించిన వాహనాలు మాత్రం పరిశ్రమలో ఏర్పాటు చేసిన పార్కింగ్‌లో, కార్మికుల వాహనాలు రోడ్డుపై అక్రమంగా ఏర్పాటు చేసిన షెడ్లల్లో పార్కింగ్ చేసి ఉంటున్నాయి. ఈ విషయాన్ని పరిశ్రమ యాజమాన్యాలను కార్మికులు అడిగే పరిస్థితి లేదు. పీఆర్ రోడ్లను ఆక్రమించి రోడ్డుకు పార్కింగ్ షెడ్లు ఏర్పాటు చేసిన పరిశ్రమలపై గ్రామ పంచాయతీలకు నియమితులైన ప్రత్యేకాధికారులు చర్యలు తీసుకోవాలని పారిశ్రామికవాడ ప్రజలు కోరుతున్నారు.

చలివేంద్రం ప్రారంభం

చలివేంద్రంను ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహగౌడ్

అమీన్‌పూర్, మార్చి 24: 12వ వార్డు జయలక్ష్మీనగర్ కాలనీలో ఆదివారం అమీన్‌పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్ చలివేంద్రం ప్రారంభించారు. ఎండలు దంచికొడుతున్నాయని, ఎక్కడికక్కడ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చేందుకు సహకరించాలని కోరారు. అనంతరం లక్ష్మీ సాయి మీడియాస్ కాలనీ పోచమ్మ దేవాలయం వద్ద నూతన కమాన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హత్నూరలో హోలీ వేడుకలో పాల్గొన్న యువకులు

సందడిగా హోలీ వేడుకలు

హత్నూర, మార్చి 24: మండల కేంద్రమైన హత్నూరలో హోలీ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా ఒకరిపైఒకరు రంగులు చల్లుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. శనివారం రాత్రి గ్రామంలోని ప్రధాన కూడళ్లవద్ద కాముడి దహనం చేశారు.

కల్హేర్: మాసాన్‌పల్లిలో రంగు రంగులతో హోలీ ఆడిన యువకులు

బాధిత కుటుంబాలకు పరామర్శ

కల్హేర్: పొమ్యానాయక్ తండాలో బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



సిర్గాపూర్: కార్యకర్త కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్, మార్చి 24: విద్యుత్ షాక్‌తో మృతి చెందిన రైతు కుటుంబాన్ని, అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ నాయకుడిని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పరామర్శించారు. పొమ్యానాయక్ తండాకు చెందిన దారావత్ రాంసింగ్ పొలం వద్ద విద్యుత్ షాక్ తగిలిన వివరాలను అడిగి తెలుసుకొని కుటుంబసభ్యులను పరామర్శించారు. సంగారెడ్డిలోని ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్న కల్హేర్ మాజీ సర్పంచ్ లచ్చవ్వ భర్త బాలయ్య ఆరోగ్యస్థితిని అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నర్సింహారెడ్డి, కృష్ణాపూర్ మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి, గణపతినాయక్, వెంకట్‌నాయక్, లక్ష్మన్‌నాయక్ ఉన్నారు.

కార్యకర్తల కుటుంబానికి..

సిర్గాపూర్, మార్చి 24: సిర్గాపూర్ మండల పరిధిలోని పోచాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబ సభ్యులను నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కుమ్మరి గోపాల్ గోడ కూలి మరణించాడు. విషయం తెలుసుకున్న భూపాల్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులకు సంతాపం ప్రకటించి తనవంతుగా రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈయనవెంట మాజీ ఎంపీటీసీ కృష్ణాగౌడ్, చాకలి సాయిలు, చాకలి అంబయ్య, అంజయ్య, శంకర్, నజీర్ తదితరులు ఉన్నారు.

దాబాలో అక్రమ మద్యం పట్టివేత

దాబాలో పట్టుకున్న మద్యం బాటిళ్లను చూపిస్తున్న పోలీసులు

సిర్గాపూర్, మార్చి 24: మండలంలోని పోచాపూర్ శివారులోని ఓ దాబాపై జిల్లా టాస్క్ ఫోర్స్, సీసీఎస్ సిబ్బంది ఆదివారం దాడి చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన 58 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సిర్గాపూర్ ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. పోచాపూర్‌కు చెందిన దాబా యజమాని సిర్గాపూర్ వైన్స్ నుంచి ఎమ్మార్పీతో మద్యం తెచ్చి అధిక ధరకు అమ్ముతున్నట్లు సమాచారం రాగానే తనిఖీలు నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు. అక్రమంగా నిల్వ ఉంచిన 58 లీటర్ల మద్యం బాటిళ్లు, నిర్వాహకుడు రాములును తదుపరి విచారణకు సిర్గాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఇందులో టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

బర్దీపూర్‌కు మహా పాదయాత్ర

పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న చిమ్లాపూర్ గ్రామస్తులు

రాయికోడ్, మార్చి 24: దత్త జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని లోక కల్యాణార్థం బర్దీపూర్ పీఠాధిపత్తి డాక్టర్ సిద్దేశ్వర్ మహారాజు ఆధ్వర్యంలో మనూర్ మండలం బెల్లాపూర్ గ్రామం నుంచి ఝరాసంగం మండలం బర్దీపూర్ దత్త ఆశ్రమం వరకు నిర్వహించిన మహా పాదయాత్ర ఆదివారం మండల పరిధిలోని చిమ్లాపూర్‌కు చేరుకుంది. ఈ పాదయాత్రకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిద్దేశ్వర్ మహారాజు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ప్రేమ, దమ, కరుణ కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులకు సేవ చేయాలన్నారు. సోమవారం యాత్ర న్యాల్‌కల్ మండలానికి చేరకుంటుందని తెలిపారు. స్వాగతం పలికిన వారిలో గ్రామ పెద్దలు, మాజీ సర్పంచ్‌లు రాధిక, సతీష్‌కుమార్, భక్తులు రవీందర్, యాద్దగౌడ్, మల్లన్న, పండరి, శోభమ్మ ఉన్నారు.

మల్లయ్యగిరి గుట్టకు భక్తుల పాదయాత్ర

మల్లయ్యగిరి గుట్టకు పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

సిర్గాపూర్, మార్చి 24: మండల పరిధిలోని ఉజలంపాడ్ గ్రామం నుంచి ఝరాసంగం మండలంలోని మల్లయ్యగిరి గుట్ట ఆశ్రమానికి గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. అంతకు ముందు స్థానిక హనుమాన్ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పాదయాత్రను కొనసాగించారు. పౌర్ణమిని పురస్కరించుకొని మల్లయ్యగిరి గుట్టలో రాత్రికి జరిగే ఉత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్నట్లు తెలిపారు. మొత్తం 55 కిలోమీటర్ల పాదయాత్ర చేసినట్లు చెప్పారు.

ఘనంగా కట్టమైసమ్మ జాతర

కట్టమైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న నీలం మధు

జిన్నారం, మార్చి 24: గడ్డపోతారం కట్టమైసమ్మ జాతర ఆదివారం వైభవంగా జరిగింది. జాతరలో భాగంగా భక్తులు ఒడిబియ్యం సమర్పించారు. పట్నం వేశారు. గడ్డపోతారంతోపాటు చెట్లపోతారం, కిష్టయ్యపల్లి, అల్లీనగర్, ప్రశాంత్‌నగర్, దాచారం, తెలంగాణతల్లి కాలనీలోని ప్రజలు కట్టమైసమ్మ ఆలయానికి భారీగా హాజరై అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారికి బోనం సమర్పించారు. ఎంపీపీ రవీందర్‌గౌడ్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు నీలం మధు, ఎంపీటీసీ జనాబాయి, మాజీ సర్పంచ్ ప్రకాశ్‌చారి, అశోక్, ఎన్.శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ బశెట్టిరాజుతోపాటు వివిధ గ్రామాల నాయకులు, ప్రజలు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.